ప్రజాశక్తి
ఆదివారం 17 నవంబర్ 2024
5
విజయనగరం



ప్రదర్శన ముందు భాగాన ఎర్ర జెండాలతో మహిళలు

సిపిఎం 10వ జిల్లా మహాసభ అత్యంత ఉత్సాహ పూరితంగా ప్రారంభమైంది. ఓ వైపు డప్పుల దరువులు... మరోవైపు చిన్నారుల కోలాటం, మార్క్సిస్ట్ పార్టీ సభ్యుల ఐక్యతా రాగం, 'పోరాటాలు వర్ధిల్లాలి' అంటూ కార్మిక, కర్షకుల నోట మిన్నంటిన నినాదాలతో ప్రదర్శన ముందుకు సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనం పార్టీ జెండాలు చేబూని విప్లవ స్ఫూర్తితో ముందుకు కదిలారు. వందలాది మంది రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పదో జిల్లా మహాసభ సందర్భంగా పది మంది మహిళలు ఎర్రచీరలు ధరించి, ఎర్రజెండాలతో సమరోత్సాహంతో ప్రదర్శన అగ్రభాగాన నిలిచారు. ప్రదర్శనకు ముందు ఇక్కడికి పార్టీ నాయకులు, సభ్యులు, అభిమానులు, సానుభూతిపరులు వివిధ ప్రాంతాల నుంచి చీమల దండుగా కదలివచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలతో రహదారి ఎర్రబారింది.

బహిరంగ సభ వేదిక పైనుంచి అభివాదం చేస్తున్న నాయకులు

- భారీ ప్రదర్శనతో ఎరుపెక్కిన రహదారి
- ప్రత్యేక ఆకర్షణగా రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు
- ఉత్తేజపర్చిన నాయకుల ప్రసంగం
- సీతారాం ఏచూరి నగర్ వేదికగా ప్రతినిధుల సభ

ఉత్సాహంగా సిపిఎం మహాసభ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / విజయనగరం టౌన్

సిపిఎం పదో జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్దనున్న గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ప్రదర్శన కన్యకా పరమేశ్వరి టెంపుల్, గంటస్తంభం, మూడు లాంతర్ల కూడళ్ల మీదుగా కోట జంక్షన్ వరకు సాగింది. ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అగ్రభాగాన నిలుస్తూ ముందుకు నడిపారు. అనంతరం కోట ఎదురుగా ఉన్న బొంకుల దిబ్బ వద్ద తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సభలో నాయకుల ప్రసంగాలు పార్టీ కేడర్‌ను, సభకు హాజరైన జనాన్ని ఉత్తేజ పర్చాయి.

పేదలు, అభివృద్ధికి అత్యంత దూరంగా ఉన్న దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన సామాజిక తరగతులకు చేస్తున్న అన్యాయం, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ సంపద, వనరులను దోచిపెడుతున్న తీరును ఎండగట్టారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2,36,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీచేసేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. సభాధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ మహాసభల్లో గడిచిన మూడుళ్లలో పార్టీ శక్తి మేర ప్రజా పోరాటాలు నిర్వహించిందన్నారు. వీటిని సమీక్షించుకుని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి.రమణ, వి.లక్ష్మి మాట్లాడారు.

అసమానతల్లేని అభివృద్ధి కోసం ఉద్యమం

దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఉద్యమిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.లోకనాథం స్పష్టంచేశారు. కోట వద్ద జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి ఇచ్చిన వాగ్దానాలేవీ అమలు చేయడం లేదని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు, మహిళలకు, ఉద్యోగులకు, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ధరలు తగ్గించకపోతే మీ సంగతి చూస్తామని సభా వేదిక నుంచి హెచ్చరించారు. ప్రభుత్వ విద్యను అందుబాటులోకి తీసుకు రాకుండా, ఎన్ఇపి పేరుతో కేంద్రం పేదలకు విద్యను దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు. మరోవైపు ఉపాధి హామీ నిధుల్లో కోత విధిస్తూ నిర్వీర్యానికి కుట్ర పన్నిందని దుయ్యబట్టారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, రైతులకు సాగు నీరు అందించాలని కోరారు.

మాట్లాడుతున్న లోకనాథం

తమ్మినేని సూర్యనారాయణ

ఎం.సూర్యారావు

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యమే లక్ష్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

విజయనగరంటౌన్ : లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేయడమే లక్ష్యంగా మన ప్రణాళికలు ఉండాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు వెల్లడించారు. బహిరంగ సభ అనంతరం నగరంలోని అయ్యన్నపేట సమీపంలో గంట్యాడ రోడ్డులో ఉన్న కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (వెంకట్ సత్య కల్యాణ మండపం)లో కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ ప్రాంగణంలో సిపిఎం ప్రతినిధుల సభ ఆరంభమైంది. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు గాడు అప్పారావు, పి.రమణమ్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత సిపిఎం జిల్లా కార్యాలయ కార్యదర్శి సీపాన కృష్ణారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన వారి చిత్రపటాలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం, రాష్ట్ర నాయకులు సూర్యారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల్లో మరణించిన, ఇతర ఘటనల్లో మృతిచెందిన వారికి సంతాపంగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. మహాసభలను ప్రారంభిస్తూ వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. బిజెపి ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, మన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవడం అవసరమన్నారు. మతతత్వ, హిందూ భావజాలాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో వైరుధ్యాలు వచ్చే సమయంలో మనం అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సనాతన ధర్మం ముసుగులో బిజెపి రాష్ట్రంలో బలపడేందుకు చూస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రారంభ సభ అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ గడిచిన మూడేళ్లకు సంబంధించి నివేదిక ప్రవేశపెట్టారు. వాటిపై ప్రతినిధులు చర్చించారు.

జెండాను ఆవిష్కరిస్తున్న కృష్ణారావు

ప్రదర్శనలో సరదాగా డప్పులు కొడుతున్న చిన్నారులు

ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు

ర్యాలీలో పాల్గొన్న రెడ్‌షర్ట్ వాలంటీర్లు

పరిశ్రమలపై పర్యవేక్షణకు డిఎల్‌సి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఎంఎస్ఎంఇ, ఇతర పరిశ్రమలపై పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీని నియమించినట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. 9 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి డిప్యూటీ కలెక్టర్ జోసెఫ్‌ను ఇన్‌ఛార్జిగా నియమించినట్లు ప్రకటించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో పరిశ్రమల శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రోత్సాహానికి అవసరమయ్యేలా భూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. సూర్య ఘర్ యోజన కింద పాఠశాలల్లో, కళాశాలల్లో రూఫ్‌పై సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. సూర్యఘర్ దరఖాస్తులకు నెడ్‌కాప్ త్వరగా ఆమోదం ఇవ్వాలని అన్నారు. సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు బహిరంగ ప్రదేశాల్లో 10 ఎకరాల వరకు స్థలం ఉండే ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఒ బాలాజీ, పరిశ్రమ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతులకు చెల్లింపులు

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ● జొన్నవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ వెల్లడించారు. ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి చెల్లింపులు చేస్తామన్నారు. విజయనగరం రూరల్ మండలం జొన్నవలస రైతుసేవా కేంద్రంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జెసి ప్రారంభించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరికోతలు మొదలయ్యాయని, కొద్దిరోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఇప్పటి నుంచే అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. సాధారణ రకం ధాన్యాన్ని క్వింటాకు రూ.2300 చొప్పున కొనుగోలు చేస్తారని, దీనికి అదనంగా హమాలీ ఛార్జీల కింద ప్రతి క్వింటాకు రూ.17.17 చెల్లిస్తారని తెలిపారు. గోనె సంచులను పౌరసరఫరాల సంస్థ ద్వారా సరఫరా చేస్తారని, రైతులు ఏర్పాటు చేసుకొంటే 40 కేజీల సంచికి రూ.3.39 చెల్లిస్తారని చెప్పారు.

కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, డిఎస్ఒ మదుసూధనరావు, వ్యవసాయ శాఖ జెడి వి.టి.రామారావు, జిల్లా సహకార అధికారి పి.రమేష్, పూసపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న జెసి సేతు మాధవన్

విద్యార్థులందరికీ అపార్ ఐడిలు

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి- విజయనగరంటౌన్

ఈ నెల 20వ తేదీలోపు ఒకటి నుండి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ అపార్ ఐడిలు నమోదు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. అపార్ ఐడిలు నమోదు చేయడంలో ఆధార్‌లో పుట్టినతేదీలో తేడాలను సరిదిద్దడానికి వెంటనే ఆధార్ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌పై విద్యా శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అపార్ ఐడి రిజిస్ట్రేషన్లు ఇంతవరకు స్కూల్ ఎడ్యుకేషన్‌లో 75 శాతం, ఇంటర్మీడియట్ విద్యలో 35 శాతం, ఐటిఐలో 80 శాతం పూర్తి చేసినట్లు ఆయా అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఆధార్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల మిగిలినవి పూర్తి కాలేదని చెప్పారు. దీంతో ఆధార్ సమస్యను పరిష్కరించుకొని వెంటనే అపార్ ఐడిలను జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. బడి బయట ఉన్న ఆరేళ్ల పైబడిన బాలల వివరాలు, బడి బయట ఉండడానికి గల కారణాలపై మండలాల వారీగా నివేదిక ఇవ్వాలని డిఇఒను ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఒ బాలాజీ, డిఇఒ మాణిక్యంనాయుడు, ఐటిఐ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, ఆర్ఐఒ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

అపార్ నమోదు నూరు శాతం పూర్తిచేయాలి

అపార్ ఐడి నమోదు ప్రక్రియ నూరు శాతం జరిగేలా చూడాలని సిబ్బందికి కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఐడి నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసేలా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించామని తెలిపారు. ఆధార్‌లో తప్పొప్పులు ఉంటే వాటిని సరిచేసుకుని అపార్ ఐడిని నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

వీధి దీపాలను పునర్వినియోగించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మరమ్మతులకు గురైన వీధి దీపాలను తక్షణమే సరిచేసి పునర్వినియోగంలోకి తీసుకు రావాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య.. ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. గత కొన్నేళ్లుగా వెయ్యికుపైగా వీధి దీపాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. పాత ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో పాడైన వీధి దీపాలను సిబ్బంది భద్రపరిచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాడైన వీధి దీపాలను తక్షణమే మరమ్మతులు చేయించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. నగర పరిధిలో అవసరమైన విద్యుత్తు దీపాల ఏర్పాటులో మరమ్మతులు చేసిన వీధిదీపాలనే పునర్వినియోగించాలని సూచించారు. కొత్తగా వీధి దీపాలను, వాటి నాణ్యతను పరిశీలించారు.

వీధి దీపాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

18న యథావిధిగా గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల కోడ్ రద్దయిన కారణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పోలీసు గ్రీవెన్స్ కూడా..

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రద్దు కావడంతో ఇకపై ప్రతీ సోమవారం యథావిధిగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలపై ప్రజలు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

విజయనగరంకోట : ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని 19 నుంచి డిసెంబర్ పదో తేది వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శనివారం జిల్లాలోని ఎంపిడిఒలు, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో, మండలాల్లో 19న లాంఛనంగా ప్రారంభం కావాలన్నారు. అదేరోజు టాయిలెట్లు మంజురైన వారందరికీ మంజూరు లేఖలు అందించాలని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లకు బహుమతులను అందజేయాలని చెప్పారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో, ఆస్పత్రుల్లో టాయిలెట్ల మరమ్మతులు ఉన్న వాటిని గుర్తించి ప్రతిపాదనలు పెట్టాలన్నారు. శానిటరీ పనివారికి పనిముట్లను అందజేయడం, సన్మానించడం వంటి కార్యక్రమాలతోపాటు వారికి ప్రభుత్వ పథకాలు అందేలా నమోదు చేసుకోవాలన్నారు. ఒడిఎఫ్ కోసం కృషిచేసిన వారిని ప్రత్యేకంగా సన్మానించాలని సూచించారు. ఈ కార్యక్రమాలన్నిటిలో ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని, వారికీ ముందుగానే ఆహ్వానాలు పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు సిఇఒ సత్యనారాయణ, డ్వామా ఇన్‌ఛార్జి పీడీ కళ్యాణ చక్రవర్తి, డిపిఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఉమాశంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి మాటున కాంట్రాక్టుల కక్కుర్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏ మాటల వెనుక ఎవరి ప్రయోజనం దాగిఉందో తెలుసుకున్నంత వరకు ప్రజలు మోసపోతూనే ఉంటారట. ఈ విషయాన్ని లెనిన్ మహాశయుడు ఓ సందర్భంలో ఉద్బోధిస్తాడు. ఈ సూక్తిని జిల్లా వాసులు కొన్ని సందర్భాల్లోనైనా ఇప్పుడిప్పుడే అన్వయించుకుంటున్నారు. దీంతో పరిపాలనలో అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరి, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు అవగతం చేసుకుంటున్నామని చాలా మంది చెప్పుకుంటున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్తు సమావేశంలో వెండార్లుగా సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ వైసిపి.., వైసిపి ప్రవేశపెట్టిన విధానాలే తాము కూడా అమలు చేస్తున్నామంటూ టిడిపి తరపున స్థానిక మంత్రులు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అసలు ఏమిటీ వెండార్?, ఇరు పార్టీల్లోనూ దీనికోసం ఎందుకంత ఆత్రం? అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటే పాలక, ప్రతిపక్షాలు ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో, రూ.197 కోట్ల కోసం ఎంత పరితపిస్తున్నారో ఇట్టే అర్థం బోధపడుతుంది. జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా కూలీలకు వేతనం రూపంలో చెల్లించే మొత్తంపై 60శాతం సొమ్ము మెటీరియల్ కాంపోనెంట్ పనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. గతంలో ఇలా వచ్చిన మొత్తాన్ని వెండార్ (మెటీరియల్ సప్లై చేసే వక్తులు) ద్వారా ఖర్చుచేసేవారు. మరో మాటలో చెప్పాలంటే వెండార్ ఖాతాలోనే డబ్బులు జమ అయ్యేవి. అలాగని సర్పంచ్ వెండార్‌గా ఉండాలన్నా మిగిలిన వారి మాదిరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే. ఇదీ గత ప్రభుత్వం మధ్యాంతరంగా తీసుకొచ్చిన వెండార్ విధానం. ఇక ఆ నిధులు వినియోగానికి కూడా ప్రాధాన్య, ప్రాధాన్యేతర అనే పద్ధతిలో ఖర్చుచేశారు. ప్రాధాన్యత పనుల్లో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, బల్క్‌మిల్క్, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు ఉండేవి. కాలువలు, రోడ్లు తదితర పనులు ప్రాధాన్యేతరలో పెట్టారు. దీంతో, కాస్త ఆర్థికంగా

అవకాశం ఉన్న సర్పంచులు మాత్రమే తమ కుటుంబ సభ్యులు, అనుయాయులను వెండార్లుగా పెట్టి పనులు చేపట్టేవారు. ఏటా డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు మాత్రమే ప్రాధాన్యేతర పనులకు అవకాశం కల్పించడంతో ఆర్థికంగా అవకాశం లేనివారు ఆ పనుల జోలికి వెళ్లేందుకు సాహసించలేని పరిస్థితి ఉండేది. దీంతో అప్పట్లో పేరుకు సర్పంచులైనా అన్నీ వెండార్ అనే కాంట్రాక్టర్ లాంటి వారి ద్వారానే పనులు జరిగిపోతుండేవి. వీరి ఖాతాల్లో మాత్రమే బిల్లులు జమయ్యేవి. ఈ రకంగా పార్టీలో కాస్త రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి ఉన్నవారికే లబ్ధి చేకూరింది. దీంతో, అప్పట్లోనే చాలా మంది గ్రామ సర్పంచులు డమ్మీలుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెండర్లు, సర్పంచులు ఒకే పార్టీ నాయకులు కావడంతో సమస్య రాలేదు. ఇందులో రూ.లక్షలు ఖర్చు చేసినా బిల్లులు కాక ఆర్థికంగా కూరుకుపోయినవారు ఎంతోమంది ఉన్నప్పటికీ అది వేరే సంగతి. ఐదు నెలల క్రితం టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 90 శాతం సర్పంచులు వైసిపికి చెందినవారే ఉన్నారు. కానీ, వెండార్ పద్ధతి ఉండడంతో ఆ స్థానంలో రాజకీయ సిఫార్సులతో టిడిపి, జనసేన నాయకులు చొరబడ్డారు. ఎమ్మెల్యేల సిఫార్సులతో పాత వెండార్లను వెనక్కి నెట్టి, కొత్త వెండార్లుగా అవతారమెత్తారు. దీంతో, సర్పంచులతో పనులు చేయించాలని, ఉపాధి పనుల్లో వారిని పక్కన పెట్టడం పంచాయతీ అధికారాన్ని హరించడమేనని ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ సహా పలువురు జెడ్‌పిటిసి సభ్యులు గొంతెత్తారు. తామేమీ విధానం మార్చలేదని, గతంలో వైసిపి తీసుకొచ్చిన వెండార్ వ్యవస్థ ప్రకారమే మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపడుతున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తేల్చేశారు. దీన్నిబట్టి ఇరు పార్టీలకు చెందిన వారూ గ్రామాల అభివృద్ధి కన్నా వెండార్ పాత్రలో కాంట్రాక్టులు పొందేందుకే తహతహలాడుతున్నారని అర్థమౌతోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

పిహెచ్‌సిని పరిశీలించిన కమిషనర్

విజయనగరం టౌన్ : నగరంలోని కెఎల్‌పురం వద్దనున్న పిహెచ్‌సిని శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. ఆ కేంద్రానికి వెళ్లేందుకు సరైన రహదారి, చుట్టూ ప్రహరీ లేకపోవడం వంటి సమస్యలను ఆయన గుర్తించారు. సదుపాయాలను కల్పించేందుకు అంచనాలను రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం నగరంలో పలు ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. సిసి కాలువలపైన కొంతమంది ర్యాంపులను వేయడాన్ని గుర్తించి, వాటిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ర్యాంపులను తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఉడా కాలనీలో పార్కును పరిశీలించారు. టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగాన్ని గుర్తించి, అపరాధ రుసుం విధించారు.

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

బొబ్బిలి: డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు డిఎస్‌పి పి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక రాజా కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాలకు యువత బానిస కావడంతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచులకు 104 సిబ్బంది వినతి

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల 104 సిబ్బంది వీడివలస పంచాయతీ సర్పంచ్ చలుమూరి అప్పలనాయుడుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు పంచాయతీ సర్పంచులకు, 18,19,20 తేదీలలో ఎంపిపి, ఎంపిటిసిలకు 21, 22, 23 తేదీలలో జెడ్‌పి చైర్మన్, జెడ్‌పిటిసిలకు వినతిపత్రం అందించాలని 104 యూనియన్ నాయకులు తీర్మానించారు. ప్రతీ నెల వేతనాలు సక్రమంగా చెల్లించాలని, 104 వాహనాలకు ఫిట్‌నెస్ ఇన్సూరెన్సులు వెంటనే చేయించాలని, పిఎఫ్, ఇఎస్‌ఐను యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 పైలెట్ షేక్ గౌస్, డేటా ఎంటర్ ఆపరేటర్ కె.తేజ, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎల్. సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు

డెంకాడ: నేరాలు అదుపు చేసేందుకు మండల కేంద్రం డెంకాడలో రెండు సీసీ కెమెరాలు శనివారం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంకాడ గ్రామంలో చేపల ఖానా వద్ద నాలుగు వైపులా కనిపిస్తున్నట్లు విజయనగరం నాతవలస రహదారిలో ఈ రెండు కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ముఖ్యమైన గ్రామాల్లోనూ ముఖ్యమైన ప్రదేశాల్లోనూ కెమెరాలను అంచెలంచెలుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, ఈవ్ టీజింగ్, దొంగతనాలు వంటి నేరాలు జరక్కుండా ఉంటాయన్నారు. ఒకవేళ జరిగితే ఈ కెమెరాల ద్వారా నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చునని తెలిపారు.

జనవాణి కార్యక్రమానికి విశేష స్పందన

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్‌కె గ్రాండ్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై జనసేన పార్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇతర సమస్యలపై అర్జీలు తీసుకుని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి, అధికారులకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తాండ్రంగి చంటి, టౌన్ ప్రెసిడెంట్ మోపాడ చిన్ని, పెనుమత్స సురేష్ రాజు, గంధవరపు సతీష్, ఎలమంచిలి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

లెండిలో ఎసిఎం కార్యక్రమం

డెంకాడ: జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మెషినరీ (ఎసిఎం) స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి మాట్లాడుతూ కంప్యూటింగ్ రంగంలో విద్యార్థులలో ఆవిష్కరణ, సహకారం, సాంకేతిక ప్రావీణ్యాన్ని పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు, విజ్ఞానం, ప్రపంచ వ్యాప్త పరిచయం చేయడంలో ఎసిఎం వంటి వేదికల ప్రాముఖ్యతను నొక్కిచెప్పినట్లు వెల్లడించారు. అనంతరం మనగింగ్ డైరెక్టర్ చమన్ బైద్ మాట్లాడుతూ గ్లోబలైజేషన్ కారణంగా వర్తక, వ్యాపార రంగంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఎంట్రప్రెన్యూర్‌షిప్ పాత్ర, వాటి అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. హరిబాబు, కెవి నరసింహం, జి. ప్రకాష్‌బాబు, ఎసిఎం నిర్వాహకులు డాక్టర్ వి. ప్రసాద్, ఇడిసి కోఆర్డినేటర్ డాక్టర్ పి. తిరుమల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సంతృప్తే లక్ష్యంగా ప్రయాణం

శృంగవరపుకోట : ప్రయాణికుల సంతృప్తే లక్ష్యంగా బస్సు ప్రయాణం ఉండాలని ఎస్‌కోట ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎపిఎస్‌ఆర్‌టిసి నిర్వహిస్తున్న సమయపాలన మాసోత్సవాలను శనివారం ఆయన స్థానిక డిపో వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులను పరిశుభ్రంగా, మంచి కండిషన్‌గా తయారు చేసి ప్రయాణీకులకు సంతృప్తి కలిగే విధంగా మెయింటనెన్స్ చేసి సకాలంలో అందించాలని చెప్పారు. మాసోత్సవాల్లో భాగంగా సిబ్బందిని సమావేశ పరచి బస్సులను బాగా తయారు చేసి డ్రైవర్, కండక్టర్‌లు సమయపాలన పాటిస్తూ ప్రయాణికుల మన్ననలు పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గారేజ్, సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

బొబ్బిలి: పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. స్థానిక గ్రోత్ సెంటర్లోని బెర్రీ, విక్టోరియా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలలో కార్మికులకు భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. భద్రత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలుష్యాన్ని నియంత్రించాలని, కాలుష్యం విడిచి పెడితే చర్యలు తప్పవని అన్నారు. కార్మికులతో మాట్లాడి భద్రత ప్రమాణాలపై అడిగి తెలుసుకున్నారు.

నెల్లిమర్ల రైల్వే గేటు మూసివేత

నెల్లిమర్ల: స్థానిక నగర పంచాయతీ పరిధిలో డైట్ కాలనీ సమీపంలో ఉన్న రైల్వే గేటును మూడు రోజులు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (పి), ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మత్త పనులు నిమిత్తం ఈ నెల 17 నుంచి 19 వరకూ గేటు మూసివేస్తామని ప్రకటించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో గల ప్రజలందరూ గమనించి వేరే ప్రాంతం నుంచి ప్రయాణాలు కొనసాగించాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుకు నాలుగు కేంద్రాలు

రామభద్రపురం: మండలంలో ధాన్యం కొనుగోలుకు 4 కేంద్రాలను ఏర్పాటు చేశామని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ బూసాయవలసలో 2, కొట్టక్కిలో , ఆరికతోటలో ఒక్కొక్క కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నెల 21 నుంచి కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని, ధాన్యం సేకరణ కోసం 30 వేల గన్నీలు, రవాణాకు 84 వాహనాలు సిద్ధం చేస్తున్నామన్నారు.

జనసేనలో చేరికలు

విజయనగరం టౌన్ : నగరంలోని 50వ డివిజన్‌లో వైఎస్‌ఆర్ నగర్‌కు చెందిన వైసిపి నాయకులు శనివారం జనసేనలో చేరారు. వీరికి జనసేన నాయకులు అవనాపు విక్రమ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముసిడిపల్లి ఉమ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో తీగల సాయికుమార్, వల్లా సత్యనారాయణ, బుగత సంతోష్ కుమార్, వజ్జి శ్రీనివాసరావు, కామేశ్వరరావు, వైసిపిని వీడారు.

192 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

డెంకాడ: అక్రమ మద్యాన్ని కారులో తరలిస్తున్నారని సమాచారంతో స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తన సిబ్బందితో మండలంలో గుణుపూర్ పేటలో శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఎన్ రఘు కారులో 192 మద్యం బాటిల్ తరలించడంతో పట్టుకున్నారు. కారును, బాటిళ్లను సీజ్ చేసి రఘుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

విశ్రాంత ఎస్ఐ ఇంట్లో చోరీ

భోగాపురం : జాతీయ రహదారి పక్కనే ఉన్న భోగాపురం గ్రామంలో విశ్రాంత ఎస్ఐ ముద్దన నారాయణరావు ఇంట్లో దొంగతనం జరిగింది. ఆయన వారం రోజుల కిందట హైదరాబాదు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న నాలుగైదు బీరువాలను చిందర వందరిగా చేసి వస్తువులు పడేశారు. క్రిందన అద్దెకుంటున్న దుకాణదారుడు ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి వెళ్లి పరిశీలించారు.

సిపిఎం మహాసభ చిత్రమాలిక

ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రెడ్‌షర్ట్ వాలంటీర్లు

చిన్నారితో ప్రదర్శనకు హాజరైన మహిళ

సిపిఎం అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు

స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న వై.వెంకటేశ్వరరావు

కోలాటం ఆడుతున్న రమణమ్మ, చిన్నారులు

గాయంతో కాలికి కట్టుతో ర్యాలీలో పాల్గొన్న వృద్ధుడు

20 నాటికి కంప్యూటరీకరణ పూర్తికావాలి

- ఆధార్ అనుసంధానంలో తహశీల్దార్లు సహకరించాలి
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశాలు

ప్రజాశక్తి- జామి

జిల్లాలోని మొత్తం 65 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అకౌంట్ల కంప్యూటరీకరణ నవంబరు 20వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి కావల్సిందేనని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ చెప్పారు. ఈ ప్రక్రియ ఇప్పటికే సంతృప్తికరంగా సాగుతుందని, వచ్చే రెండు మూడు రోజుల్లో మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని సహకార శాఖ సిబ్బందిని, పిఎసిఎస్‌ల సిబ్బందిని ఆదేశించారు. సొసైటీ సభ్యుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయడంలో తహశీల్దార్‌లు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. జామిలోని అన్నంరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ శనివారం సందర్శించి కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు జరిగిన అన్ని లావాదేవీలను కంప్యూటరీకరణ చేయాల్సి వుందని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో జిల్లా సహకార అధికారి పి.రమేష్ కూడా పాల్గొన్నారు.

కోరుకొండ సైనిక స్కూల్‌ను సందర్శించిన జెసి

విజయనగరంకోట : కోరుకొండ సైనిక స్కూల్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ శనివారం సందర్శించారు. అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. సైనిక పాఠశాలలోని డార్మిటరీ, మరుగుదొడ్లు, వంటగది, స్టడీ రూంలు, ఇతర వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, పారిశుధ్య పరిస్థితులు తగిన నాణ్యత ప్రమాణాలతో వున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై సైనిక అధికారులు జె.సి.కి వివరించారు. విద్యార్థులకు

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి సేతుమాధవన్

వసతుల విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నామని, సిబ్బంది కొరత వున్నప్పటికీ ఆ లోటు కనిపించకుండా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై జాయింట్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటరమణ కూడా పాల్గొన్నారు.

ఆర్‌డిఒ చొరవతో మహిళా రైతుకు న్యాయం

పరిహారం పొందిన రైతు నుంచి భూమి అప్పగింత

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయం భూసేకరణలో అధికారులు పరిహారం ఒకరికి వేసి మరో మహిళా రైతు వద్ద భూమిని తీసుకునే ప్రయత్నం చేశారు. కాని ఆ మహిళా రైతుకు ఆర్‌డిఒ దాట్ల కీర్తి చొరవతో ఎట్టకేలకు న్యాయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. భోగాపురం గ్రామానికి చెందిన మాతా శిఖామణి అనే మహిళా రైతు వద్ద గూడెపువలస రెవెన్యూ పరిధిలో అప్రోచ్ రోడ్డు నిమిత్తం 27 సెంట్లు భూమిని 2017లో తీసుకున్నారు. దానికి సంబంధించిన పరిహారాన్ని కూడా అప్పట్లో ఆ మహిళా రైతుకు చెల్లించారు. ఆ తరువాత రహదారికి కొలతలు వేసే సమయంలో మరో 33 సెంట్లుకు పరిహారం ఇవ్వకుండా ఈ మహిళా రైతు భూమిలో హద్దు రాళ్ళను విమానాశ్రయం నిర్మాణ సంస్థ వేసింది. కాని ఈ 33 సెంట్లుకు సంబంధించిన పరిహారం పక్క రైతుకు చెల్లించేసి ఈమె భూమిని తీసుకునే ప్రయత్నం చేశారు. 27 సెంట్లుకు పరిహారం చెల్లించి అదనంగా మరో 33సెంట్లు భూమిని తీసుకుంటున్నారంటు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. చివరకు ఆ మహిళా రైతు 33సెంట్లు చుట్టూ కంచె వేశాసేశారు. దీంతో ఈ మహిళా రైతు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తిలో ప్రత్యేక కథనాలు వచ్చాయి. దీంతో అప్పటి ఆర్‌డిఒ సూర్యకళ పరిహారం చెల్లించిన రైతు పొలంలో రెవెన్యూ అధికారులతో సర్వే చేసి 33 సెంట్లును అప్పగించారు. కాని పరిహారం పొందిన రైతు మాత్రం భూమి ఇచ్చేందుకు నిరాకరించాడు. ఆ మహిళా రైతు ఈ విషయాన్ని మళ్లీ అధికారుల దృష్టికి ఇటీవలి తీసుకువెళ్ళింది. ఈ విషయం పత్రికల్లో రావడంతో ప్రస్తుత ఆర్‌డిఒ దాట్ల కీర్తి స్పందించారు. వెంటనే పరిహారం పొందిన రైతుతో పాటు ఈ మహిళా రైతును ఇద్దరికీ నోటీసులు ఇచ్చి ఇటీవలి సమావేశమయ్యారు. దీంతో పరిహారం పొందిన భూమిలో 27 సెంట్లు మాత్రమే అప్పగించేందుకు అంగీకరించాడు. దీనికి ఆ మహిళా రైతు ఒప్పుకోవడంతో ఆమెకు న్యాయం జరిగింది.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాపు సోంపురం నుంచి దబ్బగుంటకు వెళ్లే రహదారిలో గల ఎఎస్‌ఆర్ గార్డెన్‌లో పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవింద ప్రకాష్ శర్మ, ఉపాధ్యక్షుడిగా గనివాడ బాపునాయుడు, కార్యదర్శిగా ముగ్గు ధర్మారావు, సహాయ కార్యదర్శులుగా మోపాడ బోగయ్య నాయుడు, హనుమాల శెట్టి నానాజీ, కోశాధికారిగా బాలనాగుల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా చిప్పాడ రమణ, వసంత కృష్ణ, శేఖర్ తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద ప్రకాష్‌శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు వచ్చే పథకాలు అందేలా జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలి

బొబ్బిలి: ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించాలని డిఎస్‌పి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. జాతీయ జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీకళాభారతి ఆడిటోరియం వద్ద ఉన్న సివై చింతామణి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రజలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీయడంలో కీలకపాత్ర పోషించి సమస్యలు పరిష్కారానికి పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాసరావు, ఆర్.జగదీష్, తిరుమలరావు, తౌడు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

పత్రికలు సమాజానికి పట్టుగొమ్మలు

విజయనగరంటౌన్: పత్రికలు సమాజానికి పట్టుగొమ్మలని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జి.ఎస్.ఎన్ రాజు అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రతీ సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు నిరంతరం కృషి చేస్తున్న పాత్రికేయులది సమాజంలో ఎప్పుడూ బాధ్యతాయుతమైన కీలకపాత్రేనని కొనియాడారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకపఠనం, నిరంతర సాధన వల్ల లక్ష్యాన్ని చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ఎలిశెట్టి సురేష్‌కుమార్, ఎం.విజయభాస్కర్, వై.ఎస్.పంతులు, ఎన్.సన్యాసిరావు, కంది గౌరీశంకర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొత్తలి ఎర్నాయుడు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె.దయానంద్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, ప్రధానకార్యదర్శి ఆర్.బాలకృష్ణ, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు రామభద్రరాజు, వాకర్స్ క్లబ్ సభ్యులు సత్యనారాయణ మూర్తి, కందాల సాయిబాబా పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థికి సెంట్రల్ కానిస్టేబుల్ ఉద్యోగం

విజయనగరం: సత్య డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థి ఎం.ప్రమీల సెంట్రల్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించింది. ఈ మేరకు కళాశాలలో శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూ షణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయిదే వమణి అభినందించారు. కార్యక్రమంలో కళా శాల ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.30 వేలు విరాళం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని లింగాలవలస గ్రామంలో పైడితల్లి అమ్మవారి ఆలయం నిర్మాణానికి మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తనవంతు ఆర్థిక సహాయం అందించారు. రూ.30వేలను లింగాలవలస గ్రామ పెద్దలకు శనివారం తన స్వగృహంలో అందజేశారు. గ్రామ పెద్దలు బుగత రామ్మోహన్, ఓదూరి నరసింహులు, బోని లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- మెంటాడ

సహకార సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సహకార సంఘాల తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ఎల్ఎన్‌టి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో రెండు వేల సహకార సంఘాలకు గాను కేవలం 80 సంఘాలు మాత్రమే లాభాల బాటలో నడుస్తున్నాయని అన్నారు. శనివారం మెంటాడ ప్రాథమిక సహకార పరపతి సంఘం ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్ మెంట్ హైదరాబాద్ సహకార సేవా సంమృద్ధి యోజన ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా సొసైటీలను ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిగే విధంగా కంప్యూటరైజింగ్ పద్ధతిని అవలంభిస్తున్నామన్నారు. పాలక వర్గ లోపం, సొసైటీ సభ్యులు భాగస్వామ్యం లోపం, సిబ్బంది పనితీరులో లోపం, అధికారులు సొసైటీల పట్ల పర్యవేక్షణ లోపం వల్ల సొసైటీలు నష్టాల బాటలో నడుస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్‌డిఎస్

మాట్లాడుతున్న శ్రీనివాస్

రామ్మూర్తి, సొసైటీ సిఇఒ వి ప్రసాదరావు, చల్లపేట డిసిసిబి బ్యాంకు బ్రాంచి మేనేజర్ పాండ్రంకి శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గండ్రేటి అప్పలనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ముగడ లింగేశ్వరరావు, అరసాడ అక్కునాయుడు, పి సన్యాసిరావు, వి అప్పలస్వామి సిబ్బంది పి విశ్వేశ్వర రావు, పి చిరంజీవిలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయులు జి.రామకుమార్, ఐఇఆర్‌కెయు. మహేశ్వరి హాజరయ్యారు. ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్యతో పాటుగా పలువురు గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. వీరితో పాటు గ్రంథాలయ అధికారి పెంట ఈశ్వరరావు ఉన్నారు.

డెంకాడ: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక చందాదారుడు, పాఠకుడు చందక సత్యనారాయణ గ్రంథాలయ ఉద్యమకారుల గురించి వివరించారు. లైబ్రేరియన్ మహేశ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరంకోట: సమాజ అభివృద్ధిలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయమలో 'నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 6, 7 తరగతుల విద్యార్థులకు పి.సన్యాసిరావు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ అధికారి కె.శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ ఆచారి, సిబ్బంది పాల్గొన్నారు. గాజులరేగలోని శాఖా గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు శ్రీకర్, నారాయణ పబ్లిక్‌స్కూల్ కరస్పాండెంట్ ఎం.నారాయణరావు గ్రంథాలయ పితామహుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసి పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘం జనరల్ జలజీవన్ మిషన్ ఎస్‌డిఎం నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. దేనికి ఏ నిధులు ఖర్చు పెడుతున్నారో రికార్డులో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, విఒఎలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జె. రాములమ్మ, పర్యవేక్షలు జి.సత్యప్రియ, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, డిసిసిబి మాజీ చైర్మన్ చిన రామునాయుడు, పిఆర్‌జెఇ, ఎంఇఒ, ఎంపిఒ, ఎపిఎం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: గ్రామాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవగాహన కలిగి ఉండాలని ఎంపిపి సంబంగి లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025 -2026 తయారీపై సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కిరణ్ కుమార్, ఎంపిడిఒ రవికుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, విఒఎలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజలు భాగస్వాములు కావాలని స్థానిక ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్, ఎంపిటిసి, కార్యదర్శులు, అధికారులకు ఒక్కరోజు శిక్షణా తరగతులను ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ఈ ప్రణాళికలు ఎంతో అవసరమన్నారు. ఎంపిడిఒ రత్నం మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, టిఒటిలు పార్థసారథి, బంగార్రాజు, శ్రీనివాసరావులు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం 2025-26 సంవత్సరానికి గాను ఆయా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపిటిసిలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ భాస్కరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్సులు ఆయా పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, డిజిటల్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించినట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. వనరుల సమీకరణ, మౌలిక వసతులు కల్పన, రాగల సమస్యలను ముందుగానే గుర్తించి వాటికి ఆర్థిక వనరులను సమకూర్చే దిశగా ప్రణాళిక రచించడం, ప్రభుత్వం ఉద్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి కావలసిన మార్గాలను విసిదీకరించినట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం సూచించిన నిబంధన మేరకే నిధులు ఖర్చు చేయాలని అలా అయితేనే తరువాత గ్రాండ్ అడ్జస్ట్ అవుతుందని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీరు అందించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గ ప్రజలకు సురక్షితమైన తాగునీరు, రైతులకు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో శనివారం నియోజకవర్గ సమస్యలపై ఆయన ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. సురక్షితమైన తాగునీరు అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. బొబ్బిలి, తెర్లాం మండలాల రైతులకు సాగునీరు అందించేందుకు పిరిడి, లోచర్ల వద్ద ఎత్తిపోతల పథకానికి వైసిపి హయాంలో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. దీంతో రైతులకు సాగునీరు అందకపోవడంతో పంటలు పండక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంగలరాయసాగర్, పాచిపెంట పెద్దగెడ్డ ప్రాజెక్టుకు జైకా నిధులు మంజూరైనప్పటికి ప్రాజెక్టు ఆధునీకరణ పనులు జరగలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్ హామీలు ఇచ్చారని ఆయా హామీలను అమలు చేయాలని కోరారు.